www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 23 నవంబర్ 2024
5
వైఎస్‌ఆర్



డైమండ్ జూబ్లీకి ఆహ్వానం

ప్రజాశక్తి- కడప అర్బన్

అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం కడప జిల్లా శాఖ డైమండ్ జూబ్లీ సమావేశం ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు యుటిఎఫ్ భవన్‌లో నిర్వహించనున్నారు. శుక్రవారం సంఘం జిల్లా అధ్యక్షులు కొండయ్య, జాతీయ ఉపాధ్యక్షులు పి.చంద్రశేఖర్ కలిసి కడప, అన్నమయ్య జిల్లా డిఎంహెచ్‌ఒలు డాక్టర్ కె. నాగరాజు, కొండయ్యను కలిసి సమావేశాలకు హాజరుకావాలని కోరారు. సమావేశానికి జాతీయ అధ్యక్షులు పి.వి. రమణ, రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ హాజరవుతున్నట్లు వెల్లడించారు. వివిధ జిల్లాల నుంచి జిల్లా నాయకులు విచ్చేయనున్నారని పేర్కొన్నారు. గిరిజన ఉద్యోగుల సమస్యల పైన చర్చిస్తారని చెప్పారు. కడప జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు చేస్తారని తెలిపారు. సమావేశంలో బాబు నాయక్, గంగాధర్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

'ఎపిజిబి'కీ ఎసరు!

అమరావతికి తరలింపు కుతంత్రం
మొన్న.. ఎంఎస్‌ఎంఇ,
నేడు.. ఎపిజిబి..రేపు..?
ఆందోళనలో ఎపిజిపి ఉద్యోగ సంఘాలు

రాష్ట్రంలోని కూటమి సర్కారు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు (ఎపిజిబి) ప్రధాన కార్యాలయ తరలింపునకు ఎసరుపెట్టింది. ఇటీవల కొప్పర్తి పారిశ్రామికవాడలోని ఎంఎస్‌ఎంఇ పార్కు తరలింపునకు జిఒ జారీ చేయడం, తాజాగా కడపలోని ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని బ్యాంకుల విలీనం పేరుతో అమరావతికి తరలించడానికి కుతంత్రం పన్నుతోంది. 2014 రాష్ట్ర విభజన అనంతరం నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో ఒక్కో జిల్లాను ఒక్కో తరహాలో అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి హోదాలో అప్పటి సిఎం చంద్రబాబునాయుడు ప్రకటించిన సంగతి తెలిసిందే. రాజధానిగా అమరావతి ప్రకటన అనంతరం ఇచ్చిన హామీలు, చేసిన బాసలు మరిచిపోయారు. ఇంతటితో ఆగకుండా రాయలసీమలోని రాష్ట్ర స్థాయి విభాగాల శాఖల ప్రధాన కార్యాలయాలను తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు తరలించిన తరహాలో అమరావతికి తరలిస్తూ ప్రజల మనోభావాలతో ఆడుకుంటుండడం పట్ల ఉద్యోగ సంఘాలు మొదలు సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా కేంద్రంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయ తరలింపునకు కుతంత్రం నడుస్తోంది. 1976లో రాయలసీమ గ్రామీణ బ్యాంకు పేరుతో గ్రామీణులకు బ్యాకింగ్ సేవలను చేరువ చేయడంలో భాగంగా కార్యక లాపాలకు శ్రీకారం చుట్టింది. 2006లో రాయల సీమ, అనంత, పినాకినీ బ్యాంకులను కలిపి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుగా మారింది. 18 ఏళ్లుగా చైతన్య గోదావరి, ఎపి వికాస్, చిత్తూరు సప్తగిరి బ్యాంకుల వ్యాపారాల కంటే మిగులుగా గ్రేటర్ రాయలసీమ ఉమ్మడి జిల్లాలైన కడప, కర్నూలు, అనంతపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 551 శాఖలు 2,850 ఉద్యోగులతో సేవలం దిస్తోంది. రూ.48 వేల కోట్ల టర్నోవర్‌తో కూడిన వ్యాపార కార్యకలాపాలను సాగిస్తోంది. రూ.25 వేల కోట్లు రుణాలు, రూ.22 వేల కోట్లు డిపాజిట్లు ఉన్నాయి. అత్యధికంగా 85 శాతం మేర వ్యవసాయ రుణాలను ఏడు లక్షల మంది గ్రామీణ రైతులకు అందిస్తోంది. చైతన్య గోదావరి, ఎపి వికాస్, సప్తగిరి గ్రామీణ బ్యాంకులకు మించిన శాఖలతో, వ్యాపార కార్యక లాపాలు, ఆదాయం రీత్యా పెద్ద బ్యాంకుగా ఎపిజిబి నిలిచింది. బ్యాంకు కేంద్రంగా మిగిలిన బ్యాంకులు కార్యకలాపాలు సాగించాలి. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించాలనుకోవడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఎక్కడైన నష్టాల బాటలో పడిన సంస్థలను సంస్కరించడమో, విలీనం పేరుతో బలో పేతం చేయడమో చేయడం ఆనవాయితీ. మెరుగైన టర్నోవర్లతో బ్యాంకింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తున్న బ్యాంకులను విలీనం పేరిట తరలించడ మేమిటనే వాదన వినిపిస్తోంది.

రాష్ట్రంలోని ఇతర గ్రామీణ బ్యాం కులతో విలీనం చేసి రాజధాని కేంద్రమైన అమ రావతికి తరలించాలని కుట్ర పన్నిందనే విమర్శలు బ్యాంకింగ్ వర్గాల నుంచి వినిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. తెలంగాణలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఏర్పాటు తరహాలో కదులుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా కేంద్రంలోని ఎపిజిబి ప్రధాన కార్యాలయంలో 200 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అమరావతికి తరలిస్తే సదరు ఉద్యోగులు అమరావతికి వెళ్లాల్సి ఉంటుం దనడంలో సందేహం లేదు. కేంద్ర ప్రభుత్వ అను మతి నేపథ్యంలో ఆర్‌బిఐ ఆదేశాలతో ఎపిజిబి తరలిం చడానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడు దల చేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. అనంతరం జిల్లాలోని ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్‌బిఐ ఆమోదం, కేంద్రం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు కదిలే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఎపిజిబి హెడ్‌క్వార్టర్స్ తరలించడం తగదు



ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని తరలించడం తగదు. డిఎఫ్‌ఎస్ గైడ్‌లైన్స్, బ్యాంకు పరిమాణం, ఆదాయం ఆర్జన, వ్యాపార కార్య కలా పాల రీత్యా ఎలా చూసినా తరలించడం సరికాదు.

- డి.మహ్మద్, ఎపిజిబి ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కడప.

ఎపిజిబి తరలిస్తే ఉద్యమిస్తాం



కడప ఎపిబిజిపి ప్రధాన కార్యాలయాన్ని తరలిస్తే ఉద్యమిస్తాం. వెనుకబడిన ప్రాం తాలకు బ్యాంకులను మరింత చేరువ చేయాల్సిందిపోయి, రాయల సీమలో ఉన్న అరకొర సంస్థలను, కార్యాలయాలను అమరావతికి తరలించాలనే ఆలోచనలు మానుకోవాలి.

- డి.దస్తగిరిరెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి, కడప.



వైద్య సిబ్బందికి సూచనలు, సలహాలిస్తున్న డిఎంహెచ్‌ఒ నాగరాజు

ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల శాతం పెంచాలి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి- గోపవరం

ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల శాతం పెంచాలని డిఎంహెచ్‌ఒ నాగరాజు పేర్కొన్నారు. శ్రక్రవారం బద్వేల్ మండలంలోని తొట్టిగారి పల్లె ప్రాథమిక ఆరో గ్యకేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజూ పది కాన్పులు చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొ న్నారు. ఈ కాన్పులు జరగాలంటే 108, ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్, స్టాఫ్ అందరు కూడా ప్రతి గర్భిణికీ అవగాహన కల్పించాలన్నారు. సంక్రమణ, అసం క్రమణ వ్యాధులపై 3.0 సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వి.మల్లేష్, డాక్టర్ జె. వినయ్ కుమార్, వైద్యా ధికారి అసిస్టెంట్ మలేరియా, ఆఫీసర్ జి వెంకట్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ బి వెంగ య్య, హెల్త్ సూపర్‌వైజర్ రాఘవ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఉన్నారు.

కాలబైరవ స్వామిని దర్శించుకున్న జడ్జి దంపతులు


ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని బాసట స్వచ్ఛంద సేవా సంస్థ దత్తత గ్రామమైన శ్రీ కాలభైరవపురం(ఎమ్మెస్ కొట్టాల) పునః నిర్మించిన పురాతనమైన శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవ స్వామి ఆలయాన్ని జిల్లా న్యాయమూర్తి జి. శ్రీదేవి, రామారావు దంపతులు, వారి కుమార్తె ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్జి దంపతులచే బ్రాహ్మణపల్లె చంద్రమౌళి శర్మ, శ్రీధర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.కూష్మాండదీప సేవారాధన కార్యక్రమం నిర్వహించారు. బాసట నిర్వాహకులు డి.ఎ. కార్తీక్ రెడ్డి ఆలయ చరిత్రను వివరించి వారిని సత్కరించారు. స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో బాసట ప్రతినిధులు పాల్గొన్నారు.

కడప గడపన మెరిసిన చిత్రకళ

ప్రజాశక్తి - కడప అర్బన్

చిత్రకళలో మన జిల్లాకు పలు ప్రత్యేకతలు ఉన్నాయని ఇంటాక్ సభ్యులు మంజులారెడ్డి అన్నారు. భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) వారసత్వ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం నాగరాజుపేట మున్సిపల్ హైస్కూలు విద్యార్థులచే ఉపాధ్యాయుడు, ఇంటాక్ సభ్యుడు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌జిఒ కాలనీలోని కళాకృతి ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. ఈ సందర్భంగా మంజులారెడ్డి మాట్లాడుతూ భారతీయ చిత్రకళ ఎంతో గొప్పదని, మొన్నటితరంలో రవివర్మ, నిన్నటితరంలో తెలుగు చిత్రకారుడు బాపు తదితరులు ఎంతో పేరుగాంచారన్నారు. జిల్లాలో కూడా ప్రతిభగల ఎందరో చిక్రకారులు ఉన్నారని, వారి ప్రతిభను ప్రపంచానికి చాటాలని డాక్టర్ మాధవి ఈ ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటు చేశారన్నారు. సభ్యులు సుభఖ్ తాహిన్ మాట్లాడుతూ బ్రౌన్ ఊహా చిత్రాన్ని గీసిన మన జిల్లా చిత్రకారుడు మైనంపాటి సుబ్రమణ్యం ప్రపంచానికి అపురూపమైన వరాన్ని ఇచ్చిన చిత్రకారుడయ్యారని కొనియాడారు. సభ్యులు, చిత్రకారుడు రాఘవేంద్రవర్మ మాట్లాడుతూ పది వేల సంవత్సరాల కిందటే జిల్లాలో చిత్రకళ విరాజిల్లిందని చింతకుంట చిత్రాలు చెబుతున్నాయన్నారు. అనంతరం నిర్వాహకులు ఆర్ట్ గ్యాలరీలోని అన్ని విభాగాల చిత్రాలు, వాడే రంగులు, వేసే పద్దతులు తదితరాలను విద్యార్థులకు వివరించారు. తర్వాతి విభాగంలో నాగరాజుపేటలోని మున్సిపల్ హైస్కూలులో సుగవాసి గంగాధర్, మంజులారెడ్డి, తాహిన్, సుబ్బారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో జిల్లా వారసత్వ సంపద గురించి వివరించి 30 మంది బాల బాలికలతో హెరిటేజ్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు.



చిత్రాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఇంటాక్ సభ్యులు



చెత్త తొలగించకముందు..



చెత్త తొలగించిన తరువాత ..

చెత్తాచెదారం తొలగింపు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-కడప అర్బన్

దేవుని కడపలో శ్మశాన వాటికకు వెళ్లే రహదారి చెత్తాచెదారంతో నిండిపోయింది. ఈ సమస్యకు సంబంధించి గురువారం ప్రజాశక్తిలో 'శ్మశాన వాటిక రోడ్డుపై చెత్తాచెదారం' అనే కథనం వెలువడింది. దీనిపై స్పందించిన కార్పొరేషన్ అధికారులు సచి వాలయ సిబ్బందిని సమస్య ఉన్న ప్రాంతానికి పంపించి చెత్తాచెదారాన్ని తొలగించేలా చేశారు. ప్రజాశక్తి వార్తకు అధికారులు స్పందించడంతో స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాథమిక విధులను విస్మరించొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

రెవెన్యూ రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ భూముల కేటాయింపు విషయంలో ప్రాథమిక విధులను విస్మయించకుండా ఎస్‌ఒపి ప్రకారం బాధ్యతలను నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ శీధర్ చెరుకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు.శు క్రవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో జెసి అదితిసింగ్, డిఆర్‌ఒ విశ్వేశ్వర్‌నాయుడుతో కలిసి ఆర్‌డిఒలు, తహశీల్దార్లు భూముల రీ సర్వే, భూ రికార్డుల స్వచ్ఛీకరణ, ఫ్రీ హోల్డ్ ల్యాండ్స్, భూసే కరణ రెవెన్యూ శాఖలో పెండింగ్ అంశాలు తదిత రాలపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రతి పౌర సేవలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాల న్నారు. డిసెంబర్ 1 నుంచి ప్రతి రెవెన్యూ కార్యాల యంలో ఈ-ఆఫీస్ నిర్వహణ పక్కగా జరగాలని సూచించారు. ప్రధానంగా రెవెన్యూ శాఖలో ఎక్కడా కూడా పెండింగ్ పెండింగ్ అంశాలు కనిపిం చకూడదని డివిజనల్, నియోజక వర్గ, మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. భూ రికార్డుల స్వచ్ఛీకరణ, మ్యుటేషన్స్, ఆర్‌ఒఆర్, ఎంక్రోచ్ మెంట్, వెబ్ ల్యాండింగ్, రీసర్వే ప్రక్రియలో అన్ని పనులను రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు, మండల తహశీల్దార్లు క్షేత్ర స్థాయిలో నిర్దేశిత లక్ష్యం మేరకు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

రెవెన్యూ కార్యాలయాల్లో విఆర్‌ఒల నుండి డిఆర్‌ఒ స్థాయి వరకు ప్రతి అంశాన్ని ఫైల్ రికార్డ్ నిర్వహణ కచ్చితంగా చేపట్టాలన్నారు. కార్యాలయాల్లో ఏ అధికారి మారినా రికార్డుల నిర్వహణ మాత్రం మారకూడదన్నారు. ఎక్కడయినా రికార్డులు లేవనే సమాధానం వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. మండల స్థాయిలో ప్రతి గ్రామానికి సంబంధించి భౌగోళిక, సామాజిక అంశాలపై తహశీల్దార్లు క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ భూమిని అడుగు కూడా కారణం లేకుండా ప్రయివేటు వ్యక్తులకు అప్పగించే హక్కు రెవెన్యూ అధికారులకు లేదన్నారు. రెవెన్యూ శాఖలో కదిలే ప్రతి అధికారిక కాగితం.. ఎస్‌ఒపి. ప్రకారమే జరగా లన్నారు. అన్ని సచివాలయాల పరిధిలో ప్రభుత్వ సర్వీసుల కోసం వచ్చే సర్వీసు రిక్వెస్టులను పెండింగ్ లేకుండా నిర్దేశిత సమయం లోపు క్లియర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, భానుశ్రీ, చంద్ర మోహన్, సర్వే ల్యాండ్స్ ఎడి మురళీక్షిష్ణ, సెక్షన్ ఆఫీసర్లు, మండల తహశీల్దార్లు, నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు, సూపరింటెండెంట్లు హాజరయ్యారు.



విసిని అభినందిస్తున్న అతిథులు

వైవీయూతో కేరళ క్రైస్ట్ కళాశాల ఒప్పందం

ప్రజాశక్తి- కడప అర్బన్

యోగివేమన విశ్వ విద్యాలయం ఎర్త్ సైన్సెస్ విభాగం (భూశాస్త్రవిభాగం) కేరళలోని ఇరింజలగూడ, క్రైస్ట్ కాలేజ (అటానమస్) జియాలజీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. యోగివేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ పి. పద్మ ఎర్త్ సైన్సెస్ హెచ్‌ఒడి ఆచార్య తుమ్మలకుంట శివ, డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, ప్రొఫెసర్ క్రిస్ట్ కాలేజ్ ఆచార్యులు లింటో అలప్పట్ డాక్టర్ రేష్మి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అకడమిక్‌గా, పరిశోధనలపరంగా పరస్పర ప్రయోజనాల కోసం ఎంఒయు కుదుర్చుకున్నట్లు తెలిపారు. జియో లాజికల్‌గా కడప బేసిన్ ఎంతో ప్రాధాన్యత కలదని తమ విద్యార్థులు పరిశోధనలు అలానే సాంకేతిక పరంగా ప్రయోజనాలు పొందుతారని అభిప్రాయం వ్యక్తంచేశారు. క్షేత్రస్థాయి సందర్శన, స్ట్రాటిగ్రఫీ హైడ్రోజియాలజీ, నీటి వనరుల మోడలింగ్ పై వైవీయూ, అలానే క్రైస్ట్ కళాశాల విద్యార్థులు, పరిశోధకులు పరస్పర అవగాహన పొందుతారని తెలిపారు.

క్రైస్తవులను అక్కున చేర్చుకున్న చంద్రబాబు

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రైస్తవులను అక్కున చేర్చుకుంటున్నారని జఫన్య గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్, టిడిపి నాయకులు పందిటి డేవిడ్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో జగ న్మోహన్‌రెడ్డి ఒక క్రైస్తవుడిగా ఉంటూ క్రైస్తవులకు చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర ప్రజలకు ఎటువంటి సౌకర్యాలు కావాలో ప్రజలతో మమేకమై వారం దరి అవసరాలు తీరుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని కొనియాడారు.

వైవీయూలో తెలుగు తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన యూనివర్సిటీ ప్రాంగణంలో, తెలుగు తల్లి విగ్రహం ఏర్పాటు చేసేందుకు అనుమతినివ్వాలని మహాకవయిత్రి మొల్లసాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు, భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ డాక్టర్. గానుగ పెంట హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి జి.వి. మనోజ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. తెలుగు తల్లి విగ్రహాన్ని ఇచ్చేందుకు దాతలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం విసి ఆచార్య కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పద్మకు వినతి పత్రంతోపాటు, తన రచనలను హనుమంతరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో తెలుగు భాష అమలుకు ప్రాధాన్యత నివ్వాలని కోరారు. అలాగే మహాకవయిత్రి మొల్లపై సాహితీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మొల్ల సాహితీ పీఠం పక్షాన, విసి ఆచార్య కృష్ణారెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇందుకు వైస్ ఛాన్సలర్ కృష్ణారెడ్డి స్పందిస్తూ, యూనివర్సిటీ పక్షాన తన సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రగిరి రెడ్డయ్య, మొల్ల సాహితీ పీఠం కార్యవర్గ సభ్యుడు షేక్.జియావుల్లా పాల్గొన్నారు.

వైద్య విద్యార్థిని మృతి బాధాకరం

ప్రజాశక్తి-కడప సిటీ

రిమ్స్ కళాశాలలో వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థి నిఖిత శర్మ (22) మృతి చెందడం విచారకరమని ప్రన్సిపల్ విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల ఆవరణలో విద్యార్థి మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ వైద్య విద్యార్థి ఈ నెల 18న అనారోగ్యంతో బెంగుళూరులో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారన్నారు. రాజస్థాన్‌కు చెందిన నిఖితశర్మ నీట్ పరీక్షలో 612వ ర్యాంక్ సాధించి 2023లో కడప రిమ్స్ కళాశాలలో వైద్య విద్యార్థిగా చేరారన్నారు. ఈ క్రమంలోనే అనారోగ్యానికి గురై చనిపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని విభాగాల హెచ్‌ఒడిలు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.



శ్రద్ధాంజలి ఘటిస్తున్న ప్రిన్సిపల్, విద్యార్థులు, హెచ్‌ఒడిలు

నిర్మాణ వారసత్వానికి నిలయం మన జిల్లా

ప్రజాశక్తి - కడప అర్బన్



యంగ్ ఇంటాక్ సభ్యులతో నిర్వాహకులు

ఘనమైన నిర్మాణ వారసత్వ సంపదకు మన జిల్లా నిలయంగా నిలిచిందని జిల్లాలో వేల సంవత్సరాలు చెక్కు చెదరకుండా ఉన్న కట్టడాలున్నాయని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ ఇంటాక్ ఆధ్వర్యంలో వారసత్వ వారోత్సవాలలో భాగంగా కళాశాల విద్యార్థులకు జిల్లా వారసత్వంపై అవగాహన కల్పించారు. జిల్లాలో వెయ్యి సంవత్సరాల నాటి అద్భుతమైన గండికోట, 200 సంవత్సరాల నాటి పాత కలెక్టరేట్, విలువైన చరిత్రను తెలిపే పలు శాసనాలు, నిర్మిత వారసత్వ సంపద ఉందన్నారు. వాటి నిర్మాణ శైలి గురించి అధ్యయనం చేయాల్సిన అవసరం ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉందని సూచించారు. కార్యక్రమ అధ్యక్షులు, ప్రముఖ సైకాలజిస్టు ఒ.వి. రెడ్డి మాట్లాడుతూ నాటి నిర్మాణాలు కాలపరీక్షకు తట్టుకుని కళాత్మకంగా నిలిచి నేటి తరానికి పాఠాలు నేర్పుతున్నాయని అభిప్రాయపడ్డారు. వాటిని నేరుగా చూడాలని సూచించారు. ఇంటాక్ సభ్యులు మంజులాదేవి మాట్లాడుతూ మన జిల్లాలో నేటి తరం నిర్మాణాలను సవాలు చేసే పద్ధతిలో అద్భుతమైన వారసత్వ సంపద జిల్లాలో పుష్కలంగా ఉందని తెలిపారు. అలాంటి ప్రాంతాలను గుర్తించి రక్షించుకునే బాధ్యత తీసుకోవాలన్నారు. త్వరలో ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె. చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహిస్తామని తెలిపారు. ఇంటాక్ ప్రచురించిన ప్రత్యేక బులెటిన్‌ను కళాశాల కరస్పాండెంట్ కం ప్రిన్సిపల్ సుదర్శన్ రెడ్డి ద్వారా ఆవిష్కరించారు. గండికోట మినీ పుస్తకాన్ని యంగ్ ఇంటాక్ క్లబ్ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు రాఘవేంద్ర వర్మ, సుగవాసి గంగాధర్, విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్/జమ్మలమడుగు/ప్రొద్దుటూరు (పుట్టపర్తిసర్కిల్)

ఎపి గ్రామ వార్డు వాలంటరీస్ సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, మనోహర్, కోశాధికారి లక్ష్మీదేవిలు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. వాలంటీర్లకు రెండు నెలల వేతనాలు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. వాటిని ఇవ్వాలని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని తెలిపారు. గతంలో ప్రతిపక్షం లో ఉన్నప్పుడు, అధికారంలోకి వచ్చిన వెంటనే వాలంటీర్లకు రూ.10వేలు చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చాలని పేర్కొన్నారు. బలవంతంగా రాజీనామా చేసిన వాలంటీర్లను విధులకు తీసుకోవాలని తెలిపారు. చంద్రబాబు వాలంటీర్లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని జమ్మలమడుగు, ప్రొద్దుటూరులలో డివైఎఫ్ఐ నాయకులు వీరనాలశివకుమార్, ప్రసాద్ డిమాండ్ చేశారు.

ప్రజలపై పన్నుల భారాలు ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి-అట్లూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల పైన పెనుభారాలు మోపుతున్నాయని, ముఖ్యంగా పన్నుల బాదుడు, హద్దు అదుపు లేకుండా కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు అమాంతంగా పెరుగుతున్నాయని, దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవితాలు దుర్భరంగా మారాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శివకుమార్, అన్వేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం అట్లూరు క్రాస్ రోడ్ వద్ద సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యుత్ ట్రూ ఆఫ్ ఛార్జీలు ప్రభుత్వమే భరించాలని అన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విభజన హామీలో భాగంగా నిరుద్యోగులకు కడప స్టీల్ ప్లాంట్ నిర్మించడంలో ఎన్‌డిఎ పభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవనిర్మాణ కార్మికులు పనులు లేక రోడ్డున పడ్డారని వాపోయారు. గ్రామాలలో బెల్ట్ షాపులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం దారుణమని వాపోయారు. సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు నెలకు రూ. 1500 అమలు చేయాలన్నారు. డిసెంబర్ 14 ,15 తేదీల్లో నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బద్వేల్ రూరల్ కన్వీనర్ వెంకటేష్, మండల కన్వీనర్ రమణ గంగయ్య, తిరుపాల్‌రెడ్డి, గోపయ్య, స్వప్నలతా పాల్గొన్నారు.

ప్రయివేటీకరణను ప్రతిఘటించాలి : సిఐటియు

ప్రజాశక్తి - బద్వేలు : ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు పట్టణ కార్యాలయంలో శుక్రవారం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆలంభిస్తున్న కార్మిక,కర్షక ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న జరిగే దేశవ్యాప్త ఆందోళనను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి, కార్మికుల హక్కులను పునరుద్ధరించాలని పేర్కొన్నారు. పని ప్రదేశంలో సమానత్వాన్ని, భద్రతను పెంచాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులను రిజిస్ట్రేషన్ చేసి వారికి పెన్షన్‌తో సహా సామాజిక భద్రత అందించాలని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని వెల్లడించారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, పట్టణ కార్యదర్శి ఎస్కె ఆదిల్, మహిళా విభాగం నాయకురాలు సి. నాగలక్ష్మి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డివిజన్ కార్యదర్శి పిసి కొండయ్య, సిఐటియు పట్టణ నాయకులు రాజగోపాల్,ఐద్వా మహిళా సంఘం పట్టణ నాయకురాళ్లు మోక్షమ్మ, బాలమ్మ, మస్తాన్ బీ,రత్తమ్మ, రజక వృత్తిదారుల సంఘం పట్టణ నాయకులు సుబ్బరాయుడు, బాబు గంగాదేవి, జ్యోతి, ఎన్‌పిఆర్‌డి నాయకులు వెంకటపతి, వెంకటేశ్వర్లు, మూరప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ

వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ : డిఇఒ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని కస్తూరిబా పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి యు.మీనాక్షి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల తరగతి గదులలో విద్యార్థుల సౌకర్యాల గురించి, బోధన గురించి వాకబు చేశారు. పదవ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు.పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయుల భోధన పనితీరును పరిశీలించి తగు సూచనలు చేశారు. కస్తూరిబా పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించుకొని చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. భవిష్యత్‌లో మంచి ఉన్నత స్థానానికి చేరుకోవడానికి పాఠశాల విద్యను ఒక సాధనంగా ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 వి.వంశీకృష్ణ, పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా మునగ మొక్కలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని రైతులకు ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేసిన నర్సరీ నుంచి ఉచితంగా మునగ మొక్కలను ఇస్తామని ఎపిఒ జయ భారతి, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ ఈశ్వరయ్య పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మండలంలోని హిమకుంట్ల వద్ద ఏర్పాటు చేసిన నర్సరీలో ప్రస్తుతానికి మునగ మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు క్షేత్రస్థాయిలోని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను, సింహాద్రిపురంలోని ఆఫీసులో కానీ ఆసక్తి ఉన్న రైతులు సంప్రదించాలన్నారు. మునగ మొక్కలను రైతులు పొలం గేట్ల వద్ద కానీ, పొలంలో 6 ఆడుగుల పొడవు, 6 ఆడుగుల వెడల్పుతో నాటుకొని అదనపు ఆదాయం పొందాలని వారు సూచించారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చూసుకోవాలని కోరారు.



అన్నదానం చేస్తున్న దాతలు

లారెన్స్ ఆశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-ఖాజీపేట

మండల పరిధిలోని చెముళ్లపల్లె పంచాయతీ ములపాక గ్రామంలో ఉన్న లారెన్స్ వృద్ధాశ్రమంలోని నిరాశ్రయులకు అన్నదానం నిర్వహించారు. శుక్రవారం చెముళ్లపల్లె దళితవాడకు చెందిన మూలపాకు బాబురావు, పుష్పలత దంపతుల కుమారుడు వరుణ్ తేజ్ జన్మదిన సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, టిడిపి నాయకులు రెడ్యం వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని కలిగి ఉండాలని, సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని ఇటువంటి సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. నిరాశ్రయులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు వ్యక్తపరిచారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు చెన్నయ్య, గ్రామస్తులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఉచిత హోమియో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వేంపల్లె : స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానానికి చెందిన కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించబోయే ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆవోఫా అధ్యక్షుడు బైరిశెట్టి సునీల్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు.

ఇంటి నిర్మాణం వేగంగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి- పులివెందులటౌన్ : పట్టణ పరిధిలోని మెగా లేఅవుట్‌లో నిర్మిస్తున్న గృహాలను వేగ వంతంగా పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రాజా రత్నం అన్నారు. శుక్రవారం ఆయన మెగా లేఅవుట్‌ను పరిశీలించారు. హౌసింగ్ డిఇ రమణారెడ్డి, డిఇసి ఏజెన్సీ ప్రతినిధి శ్రీనివాస్ అడిగి ఫీల్డ్, ఆన్‌లైన్‌లో ఇంటి నిర్మాణ దశలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాముడు, హౌసింగ్ సిబ్బంది, వార్డు ఎమినిటీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి పెండింగ్ బిల్లులు లేకుండా చూడా లన్నారు. కార్యక్రమంలో ఎఇ హౌసింగ్ రామసురారెడ్డి, వర్క్ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'పుట్టా'కు సన్మానం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను హైదరాబాద్‌లోని అయన నివాసంలో శుక్రవారం చాపాడు మండల టిడిపి యువనాయకులు, ఇరగంరెడ్డి ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో యువకులు పెద్ద ఎత్తున కలిసి సన్మానించారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే అసెంబ్లీలో ఉండటంతో ఆ రోజు రాత్రి ఆయన్ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారను. బాణాసంచా పేల్చి గజమాలతో ఎమ్మెల్యే దంపతులను సన్మానించి వారితో కేక్ కట్ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే తనయుడు, పిఆర్‌కె హాస్పిటల్ చైర్మన్ రవికుమార్‌ను శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో యువ నాయకుడు వీరు యాదవ్, యువత పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను సన్మానిస్తున్న టిడిపి యువనాయకులు

క్రైం కార్నర్

200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పట్టణంలోని బ్రాహ్మణపల్లె సమీపంలో నాటు సారా తయారికీ సిద్ధంగా ఉంచినబెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ చెన్నారెడ్డి తెలిపారు. శుక్రవారం బ్రాహ్మణపల్లి గ్రామం, కాలువ గట్టు సమీపంలో నాటు సారాను కాస్తున్నట్లు చేస్తున్నట్లు సమాచారం రావడంతో సిఐ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని దాదాపు 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తున్న మల్లికార్జున అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. పులివెందుల ఎక్సైజ్ పరిధిలో ఎవరైనా నాటు సారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా సారా కాస్తున్నట్లు తెలిస్తే ప్రజలు తమకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. దాడుల్లో టాస్క్ ఫోర్స్ సిఐ విశ్వనాథరెడ్డి, సిబ్బంది, వెంకట్రామిరెడ్డి, మల్లికార్జున, రమణయ్య, బాలసుబ్రమణ్యం, నాగేంద్ర ఉన్నారు.

మిగతా కార్యాలయాల తరలింపుపై నోరు విప్పాలి

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కాంగ్రెస్ పార్టీ, వామ పక్షాలతో పాటు ఇతర రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల విజ్ఞప్తులకు, ప్రజాభీష్టానికి తలొగ్గి లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయాలను కర్నూలు నుంచి అమరావతికి తరలించాలని తీసుకున్న నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవడం హర్షణీయమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇతర జిల్లాల్లో ఉన్న ప్రధాన కార్యాలయాలను అమరావతికి తరలిస్తున్న వాటిపైనా కూటమి ప్రభుత్వం నోరు విప్పాలని చెప్పారు. 2023 డిసెంబర్ 4న కేంద్ర ప్రభుత్వం రూ.250 కోట్లతో కడప జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక వాడలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సాంకేతిక శిక్షణా కేంద్రాన్ని మంజూరు చేసిందని చెప్పారు. 2024 సెప్టెంబర్ 24న చంద్రబాబు ప్రభుత్వం జీవో 56 ద్వారా ఈ కేంద్రాన్ని అమరావతికి తరలించడం అన్యాయం అన్నారు. జీవోను వెంటనే రద్దు చేయడంతో పాటు కొప్పర్తి పారిశ్రామిక వాడలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన జరిగిన 6 నెలల లోపల కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించాలని విభజన చట్టంలో 13 వ షెడ్యూల్‌లో స్పష్టంగా ఉందన్నారు. దీని మాటేమిటని తులసిరెడ్డి కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వక్ఫ్ ట్రిబ్యునల్‌ను, సిబిఐ కోర్టును, ఎపిఇఆర్‌సి కార్యాలయాన్ని కర్నూలు నుంచి అమరావతికి తరలించాలని తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని కోరారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

కార్యాలయాన్ని హైదరాబాద్ నుంచి రాయలసీమకు తరలించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలకు 2024- 25 విద్యా సంవత్సరానికి నేషనల్ మెడికల్ కమిషన్ 50 ఎంబిబిఎస్ సీట్లు మంజూరు చేసిందని తెలిపారు. మౌలిక సదుపాయాలు లేవని, ఫ్యాకల్టీ లేదని సాకులు చెబుతూ కేటాయించిన 50 సీట్లు వద్దని చంద్రబాబు ప్రభుత్వం లిఖిత పూర్వకంగా తెలపడంతో మంజూరైన 50:50 ఎంబిబిఎస్ సీట్లు రద్దు అయినట్లు తెలిపారు. మౌలిక సదుపాయాలు కల్పించి ఫ్యాకల్టీ నియమించి కనీసం వచ్చే విద్యా సంవత్సరనమైనా 150 ఎంబిబిఎస్ సీట్లు వచ్చే విధంగా ప్రభుత్వం ఇప్పటినుండే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, రమణ, బద్రి, వెంకటేష్, వేమయ్య, వేమా రాజా పాల్గొన్నారు.

చురుగ్గా స్వర్ణ పంచాయతీ డిజిటలైజేషన్



సర్వే చేస్తున్నపంచాయతీ సిబ్బంది

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో స్వర్ణ పంచాయతీలలో భాగంగా డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్వర్ణ గ్రామ పంచాయతీ యాప్ ఏర్పాటు చేసింది. దీంతో ప్రతి గ్రామ వివరాలను అందులో పొందుపరిచే విధంగా ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. మండల పరిధిలో 22 పంచాయతీలున్నాయి. వీటన్నింటినీ డిజిటలైజ్ చేస్తున్నామని ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి తెలిపారు. గ్రామ పంచాయతీ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, ఆ పంచాయతీలో ఉన్న గ్రామాలు, ఆ గ్రామాల విస్తీర్ణం, గృహాలు, జనాభా, మౌలిక సదుపాయాలు, కొళాయిలు, ఇంటి పన్నులు ఇలా గ్రామానికి సంబంధించిన అన్ని అంశాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. గ్రామాలకు వచ్చే నిధులు, చేపడుతున్న పనుల వివరాలను సైతం ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు.దీంతో ఆయా గ్రామాలకు సంబంధించిన పూర్తి వివరాలు యాప్‌లో ఉంటాయి. ఆ పనులను ఈ నెలాఖరు కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అందుకు అనుగుణంగా పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, సచివాలయం సిబ్బంది ఈ పనులను వేగంగా చేస్తున్నారు.

సాగునీటి సంఘం ఎన్నికలకు కసరత్తు

ప్రజాశక్తి - చాపాడు

ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సాగునీటి సంఘం ఎన్నికలను డిసెంబర్ 8న నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ 5న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. చాపాడు మండల పరిధిలో 10 సాగునీటి సంఘాలున్నాయి. వీటికి సంబంధించి ఓటర్ లిస్టులను రెవెన్యూ సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. దువ్వూరు కెసి కెనాల్ పరిధిలో అన్నపు శాస్త్రపల్లె, మడూరు, చియ్యపాడు, మైదుకూరు కెసి కెనాల్ పరిధిలో మడూరు, ఉప్పరపల్లె, అనంతపురం -1,2 , సోమాపురం, అల్లాడుపల్లి, మిడుతూరు, సాగునీటి సంఘాలు ఉన్నాయి. వీటన్నిటికీ డిసెంబర్ 8న ఎన్నికలు నిర్వహించి అదే రోజున ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ ఎన్నికకు సంబంధించి 7 గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

కార్మికుల సమస్యలు పట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక,రైతు వ్యతిరేక విధానాలను అవలంభి స్తోందని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకొచ్చిన బిజెపి కార్మిక చట్టాలను పునఃపరిశీలించకుండా కార్మికులకు రైతులకు తీరని అన్యాయం చేస్తోందని పేర్కొన్నారు.కార్మికులకు, అంగన్వాడీ, ఆశా, విఆర్‌ఎ, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఇందుకు వైసిపి మద్దతు తెలుపుతూ కార్మికులకు రైతులకు అన్యాయం చేసిందన్నారు. ప్రభుత్వాల వైఖరికి నిరసనగా ఈ నెల 26న కడప కళాక్షేత్రం వద్ద సమావేశం ఏర్పాటు చేశామని, అత్యధికంగా ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ సంఘ కార్యదర్శి సల్మాన్, కోశాధికారి రాఘవ, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, శీను, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కొండాపురంలో రైళ్లు ఆపాలి

ప్రజాశక్తి - కొండాపురం

కొండాపురం రైల్వేస్టేషన్‌లో రైళ్లను ఆపాలని గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ విజయ్‌కుమార్‌కు మండల సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు కలసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు రైల్వే మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కొండాపురం రైల్వేస్టేషన్‌లో గత బ్రిటిష్ కాలం నుండి ప్రతి ఒక్క రైళ్లను ఆపేవారన్నారు. కరోనాకు ముందు కూడా ఆపేవారని, తరువాత నిలుపుదల చేశారని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు నిత్యం దూర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారని, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైళ్ల నిలుపుదలను పునర్ధరించాలని కోరారు.

అనాథలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - ముద్దనూరు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు

స్థానిక రైల్వేస్టేషన్‌లో చలికి వణుకుతూ అవస్థలు పడుతూ నిద్రిస్తున్న అనాథలు, యాచకులకు గురువారం అర్ధరాత్రి వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామ కృష్ణారెడ్డి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాలంలో చలి తీవ్రత తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్న అనాథలకు వివే కానంద ఫౌండేషన్ అండగా నిలుస్తుందన్నారు. దాతల సహకారంతో ప్రతి ఏటా చలికాలంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, నరసింహ,విజయ్,సురేష్, పెద్దిరెడ్డి, రాజారెడ్డి, రామనాథ్ పాల్గొన్నారు

గ్రంథాలయ భవన నిర్మాణ పనులు ఎపిఇడబ్ల్యుఐడిసికి అప్పగింత

ప్రజాశక్తి- కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలోని సి.పి.బ్రౌన్ మెమోరియల్ లైబ్రరీ అభివృద్ధిలో భాగంగా నూతన భవనం నిర్మాణాల పనులను ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎపిఇడబ్ల్యుఐడిసి)కు అప్పగించారు. శుక్రవారం విశ్వవిద్యాలయం విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ ఇంజినీర్ గురివిరెడ్డి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కడప నగరంలోని సిపి బ్రౌన్ గ్రంథాలయ ప్రాంగణంలో నిర్మించనున్న ఈ నూతన భవనానికి రూ.3.66 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, ఆచార్య చంద్ర ఓబులరెడ్డి, డిఇ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు జెస్సిక

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

కమలాపురం మండలం పెద్దచెప్పలిలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థి జెస్సిక ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో శ్రీ గోవిందమాంబ బాలికల ఉన్నత పాఠశాలలో చదువతున్న 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని బాపట్లలో నిర్వహించే రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు యన్. నిర్మలాదేవి పేర్కొన్నారు. విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లో రాణించడానికి ఎస్ఎ పిఇ పి. పుష్పలత ప్రోత్సాహంతో గతంలో తమ పాఠశాల విద్యార్థినులు వివిధ రకాల క్రీడా పోటీలలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వారు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ధ్యేయం

- టిడిపి కడప పార్లమెంట్ కార్యదర్శి బొజ్జ మైసూరారెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా నియోజకవర్గ సమస్యలను మండలిలో ప్రశ్నించడమే కాక వారి పరిష్కారం కోసం పోరాడే వ్యక్తి శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అని టిడిపి కడప పార్లమెంటరీ కార్యదర్శి బొజ్జ మైసూరా రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్సీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో మరమ్మతులు చేయాలని, కాలేటివాగు పనులు పూర్తిచేయాలని, మెడికల్ కళాశాల తరగతిన పూర్తి చేసి వచ్చే సంవత్సరానికి కల్లా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మండలి సమావేశంలో మాట్లాడారని చెప్పారు. రైతుల మోటర్లకు మీటర్లు బిగించకూడదని, గతంలో జరిగిన అవినీతి గురించి, కరువు మండలాలుగా ప్రకటించలేదని తదితర విషయాలపై అసెంబ్లీలో మాట్లాడిన వ్యక్తి రాంగోపాల్ అన్నారు. కార్యక్రమంలో పట్టణ యూత్ అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి రోటరీ పురం రఫీ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందేలా చూడాలి : పిఆర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మైలవరం రిజర్వాయర్ ఆయకట్టు కింద ఉన్న చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చూడాలని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం శాసన మండలిలో స్పెషల్ మెన్షన్ కింద ప్రభుత్వానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం రిజర్వాయర్ కింద 75 వేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. 2018వ సంవత్సరం నుండి గాలేరి - నగరి ద్వారా కృష్ణాజలాలు వచ్చి పూర్తిగా ప్రాజెక్టు నిండినా ఆయకట్టు చివరి వరకు నీరు అందించలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రతి సంవత్సరమూ జమ్ము బాగా పెరగడం, మైనర్, మేజర్, డిస్ట్రిబ్యూటర్స్ కాలువలు రిపైర్స్‌లో ఉన్నాయన్నారు. గతంలో పంట కాలువలు (ఆయకట్టు కాలువలు) పూర్తిగా పాడైపోయ్యాయని చెప్పారు. పంట కాలువలు పునరుద్ధరించడానికి, పూడిక తొలగించడానికి నిధులు కేటాయించి పూర్తిస్థాయిలో చివరి ఆయకట్టు వరకు అన్ని కాలువలకు నీరు అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

సిసిబికి రూ.30 కోట్లు మంజూరుకు మంత్రి హామీ

ప్రజాశక్తి-రాయచోటి

తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులకు సమగ్ర సంరక్షణ అందించడానికి రాయచోటిలో క్రిటికల్ కేర్ బ్లాక్‌ను (సిసిబి)ఏర్పాటుకు రూ.30 కోట్లు మంజూరు చేయనున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి హామీ ఇచ్చారు. భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన క్రిటికల్ కేర్ బ్లాక్‌ల ఏర్పాటు విధానం ద్వారా తీవ్రమైన కేసులకు చికిత్స అందించే సౌకర్యాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను రవాణా, యువజ, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. క్రిటికల్, ట్రామా కేర్ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా రోగులకు ప్రత్యేక సంరక్షణ, పర్యవేక్షణ అవసరం కాబట్టి, ప్రస్తుత ఐసియు సామర్థ్యం సరిపోదని అందువల్ల మెరుగైన పేషెంట్ కేర్ కోసం రాయచోటిలో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుకు రూ.30 కోట్ల మంజూరు చేయాలని కోరగా ఆరోగ్య శాఖ మంత్రి సానుకూలంగా స్పందించి రూ.30 కోట్లు మంజూరు చేయనున్నట్లు మంత్రి మండిపల్లి తెలిపారు.



నీటితొట్టిలో అబిట్ మందును వేస్తున్న వైద్య సిబ్బంది

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పులివెందుల మలేరియా అధికారి సిద్దయ్య చెప్పారు. శుక్రవారం వేంపల్లెలోని రాజారెడ్డినగర్‌లో డ్రైడే, ఫ్రైడేను నిర్వహించారు. రాజారెడ్డినగర్‌లోని ఇంటింటికి వెళ్లి రక్త నమూనాలను సేకరించడంతో పాటు లార్వా సర్వేను చేపట్టారు. అలాగే నిల్వ ఉన్న నీటిలో అబేట్ పిచికారి చేసి మలేరియా, డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించారు. జ్వరాలు సోకిన వెంటనే ప్రభుత్వాసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని మలేరియా అధికారి సిద్దయ్య చెప్పారు. ఆరోగ్య కార్య కర్తలకు ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి రక్త నమూనాలను సేకరించాలని సూచించారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు వహించాలని కోరారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలు దరి చేరవని చెప్పారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వెంకటరత్నం, ఎంపిహెచ్ఇఒ బాబా ఫకృద్దీన్, ఎంఎల్ హెచ్‌పి శంకరమ్మ, ఆరోగ్య కార్యకర్త శిరీష, ఆశా కార్యకర్త తులసి పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఒడి

ఎస్ఆర్ఐటిలో వర్క్‌షాప్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్ ఫస్ట్ ఇయర్ సిఎస్‌సి విద్యార్థులకు హెచ్ఒడి డా వై. సుబ్బారెడ్డి, ప్రొఫెసర్ డా. రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పైథాన్ ప్రోగ్రామ్మింగ్ పై ఒకరోజు వర్కుషాప్ శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ రామసుబ్బారెడ్డి పైథాన్‌పై కెరీర్ అవకాశాలు, వెబ్ డెవలప్‌మెంట్ డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్, గేమ్ డెవలప్‌మెంట్ వంటి పైథాన్ అప్లికేషన్స్ లను గురించి వివరించారు. ఈసందర్భంగా చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్‌రవి, కరస్పాండెట్ వీర కళ్యాణ్ రెడ్డి సంయుక్తంగా మాట్లాడుతూ విద్యార్థులు వర్కుషాప్ లోని విషయాలను అవగాహన చేసుకుని భవిష్యత్‌లో వినియోగించుకోవాలని కోరారు.కార్యక్రమంలో హెచ్ఒడిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-కమలాపురం



జాతీయస్థాయి ఖోఖో పోటీలకు స్థానిక పివిఎస్ఆర్ఎం జూనియర్ కళాశాలకు చెందిన కె. వీరేష్ ఎంపికైనట్లు పీడీ ఖాదర్ రెడ్డి తెలిపారు. ఈనెల 4 నుంచి 6 వరకు చిత్తూరు జిల్లాలోని కాణిపాకంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయాడని పేర్కొన్నారు. ఈనెల 25 నుండి 29 వరకు ఉత్తరప్రదేశ్ లోని అలిగడ్‌లో నిర్వహించే 43వ జూనియర్ నేషనల్ ఖోఖో ఛాంపియన్‌షిప్ జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్ రెడ్డి తెలిపారు. అనంతరం కరస్పాండెంట్ విద్యార్థిని అభినందిస్తూ జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచి తల్లిదండ్రులకు కళాశాలకు పేరు తేవాలని తెలిపారు. విద్యార్థికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు.

బ్రాహ్మణులకు చోటు హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె : హిందూ దేవస్థానం పాలక మండలిలో బ్రాహ్మణులకు చోటు కల్పించడం హర్షణీయమని జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పివిఎస్ వి ప్రసాద్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సిఎం చంద్రబాబు నాయుడు దేవస్థానం కమిటీలో బ్రాహ్మణులకు అవకాశం కల్పించేందుకు అసెంబ్లీలో బిల్లును ప్రవేశ పెట్టారని చెప్పారు.వేదం చదివిన బ్రాహ్మణులకు నిరుద్యోగ భృతిని కల్పిస్తామని చెప్పిన హామీ ప్రకారం రూ 3వేలు హామీని కూడ అమలు చేయడం సంతోషకరమని చెప్పారు. దూప, దీప్ప నైవేద్యాలకు రూ. 5వేలు నుంచి రూ.10వేలు పెంచారని చెప్పారు. రూ 50 వేలు పైన ఆదాయం వచ్చే దేవాలయాల అర్చకులకు రూ.15వేలు అందేలా చేయడం సంతోషకరమన్నారు. బ్రాహ్మణుల పట్ల తెలుగుదేశం పార్టీకి ఉండేటువంటి శ్రద్ధకు నిదర్శనం అన్నారు. బ్రాహ్మణుల అభివృద్ధి కోసం అసెంబ్లీలో బిల్లును ప్రవేశ పెట్టినందుకు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పెండ్లూరులో గ్రామోత్సవం

ప్రజాశక్తి - వేముల : మండలం స్థానిక పెండ్లూరు గ్రామపంచాయతీలో అయ్యప్ప స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ఊరేగించారు. మొదటి సారి మాలధారణ చేసిన స్వాములు కలశాలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్ర మంలో గురు స్వాములు బాల గంగిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ,రామోహన్ రెడ్డి, బండల కొండా రెడ్డి సుదర్శన్‌రెడ్డి, తాలుకాలోని అయ్యప్ప భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శి దాసరి విజయ్, ఎసుదాస్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో వారు మాట్లాడుతూ సర్వ సంపదలు సృష్టించేది కార్మికులు, ప్రజలకు తిండి పెట్టేది రైతులు, కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరికి వ్యతిరేక మన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లు , పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్నారన్నారు. పదేళ్ల బిజెపి పాలనలో కార్పొరేటర్లకు రూ.19.28 లక్షల కోట్ల రుణమాఫీ, పన్ను రాయితీ, ప్రోత్సహాల పేరుతో ప్రజల సొమ్ము దోచి పెట్టిందన్నారు. ప్రజలు, కార్మికులు, రైతులు, ప్రతి ఒక్కరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభించే ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు వితరణ

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు మున్సిపల్ పరిధిలోని ఎస్‌వివి ప్రభుత్వ బాలుర పాఠశాలలోని విద్యార్థులకు రోజీ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు శుక్రవారం భోజనం చేసే స్టీల్ ప్లేట్లు వితరణ చేశారు. బాలమునిస్వామి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా 33వ వార్డు కౌన్సిలర్ గాజుల శివజ్యోతి మాట్లాడుతూ మనిషి జీవితంలో విద్యార్థి దశ ఎంతో విలువైందన్నారు. ఈ దశలో కేవలం చదువుమీదే ఏకాగ్రత పెట్టాలన్నారు. చదువు మాత్రమే మనిషిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు కుతుబుద్దీన్, సొసైటీ సభ్యులు అచ్చుకట్ల హుశేన్‌సా, దేశంరెడ్డి మోతుకూరి లక్ష్మీనారాయణ, దాదాపీర్, సావిత్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్టీల్ ప్లేట్లు అంజేస్తున్న సొసైటీ నిర్వాహకులు